సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023

ప్రగతి వెలుగులు

- పాడేరు జిల్లా కేంద్రంగా విశేష అభివృద్ధి
- సంక్షేమం, సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పాలన
- ఆర్థిక, సామాజిక, సేవా రంగాల్లో విశేష సేవలు
- ఫలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కృషి

గిరిజనులకు పాలనను దగ్గర చేసే లక్ష్యంతో పాడేరు కేంద్రంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రగతి పరుగులు పెడుతోంది. అరకులోయ, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలోని 22 మండలాలు 430 పంచాయతీలు 2,969 రెవెన్యూ గ్రామాల పరిధిలో గిరిజనుల సంక్షేమం, సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అధికార యంత్రాంగం సేవలందిస్తోంది.



కిల్లంకోట పంచాయతీ వొలిమామిడిలో ఓ ఇంటి వద్ద ఏర్పాటుచేసిన కుళాయిలు



పాడేరు మండలంలోని బలిసింగి పంచాయతీకి నిర్మించిన తారు రోడ్డు

సాక్షి,పాడేరు: వెనుకబడిన గిరిజన ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి మైదాన ప్రాంతాలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తోంది. ఈ ఏడాది గిరిజనాభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టింది. విద్య, వైద్య సేవలను విస్తృతం చేసింది. గ్రామాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. ఆర్థిక, సామాజిక, సేవా రంగాల్లో విశేషమైన ప్రగతి సాధనే లక్ష్యంగా చర్యలు చేపట్టింది.

- నాడు–నేడు రెండవ విడతలో 949 పాఠశాలలు,127 అంగన్‌వాడీ కేంద్రాలు, 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులు శరవేగంతో జరుగుతున్నాయి.ఇప్పటికే రూ.30 కోట్ల వరకు ఖర్చుపెట్టారు. జిల్లాలోని 8వతరగతి విద్యార్థులు 14వేల మందికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లిలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు.
- ఫ్యామిలి డాక్టర్ వైద్యంతో వైద్యబృందాలు గడపగడపకు వెళ్లి సేవలందిస్తున్నాయి. ఈఏడాది రాష్ట్ర ప్రభుత్వం అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య నిపుణులతో 99,214మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉన్నత వైద్యసేవలు కల్పించింది. పాడేరు జిల్లా ఆస్పత్రిలో 2,535 శస్త్రచికిత్సలు విజయవంతంగా జరిగాయి.
- సొంతింటి కళను ప్రభుత్వం సాకారం చేయడంలో భాగంగా 17,111 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే వెయ్యి ఇళ్లు పూర్తికాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.
- జిల్లాలో 2024 నాటికి తాగునీటి సమస్య పరిష్కరించే లక్ష్యంగా రూ.630 కోట్లతో 6.,945 తాగునీటి పథకాల పనులను ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌లోమంజూరు చేసింది. ఈ ఏడాది ఇప్పటికే వెయ్యి పనులు పూర్తయ్యాయి.
- జిల్లా వ్యాప్తంగా ప్రజలకు కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తేవడంలో భాగంగా 2059 సెల్ టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలను మంజూరు చేసింది. వీటిలో 405 టవర్లు ఈఏడాది వినియోగంలోకి వచ్చాయి.
- మిషన్ కనెక్టు పాడేరుతో పాడేరు ఐటీడీఏ పరిధిలో 514 గ్రామాలకు రోడ్లు నిర్మించేందుకు రూ.274 కోట్ల ఉపాధి నిధులను మంజూరు చేసింది. ఈనిధుల్లో ఇప్పటివరకు రూ.100కోట్లు ఖర్చు చేశారు.సుమారు రూ.500కోట్లతో తారురోడ్లు,గెడ్డలపై వంతెనల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి.
- ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు జోరందుకున్నాయి.ఈఏడాది 100 గ్రామ సచివాలయాలు, 90ఆర్‌బీకేలు, 40 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.
- వ్యవసాయ రంగానికి సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వం రైతు భరోసా పథకంలో 1.69లక్షల మందికి ఆర్థికసాయం అందిస్తోంది. ఖరీఫ్‌లో రూ.7.97 కోట్ల విలువ చేసే వరివిత్తనాలను 90శాతం రాయితీపై పంపిణీ చేసింది. రూ.6.30కోట్ల విలువైన రాజ్‌మా విత్తనాలను ముందస్తు రబీలో రైతులకు 90శాతం రాయితీపై అందుబాటులోకి తెచ్చింది.
- జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి సీసీరోడ్లు, ఇతర పనులకు రూ.30.67 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.వీటిలో 918 పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- పర్యాటక రంగాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తోంది. గిరిజన మ్యూజియం, చాపరాయి జలపాతం, పద్మాపురం ఉద్యానవనానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది.

మరింత పురోగతి లక్ష్యం



అన్ని సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తున్నాం. విద్య,,వైద్యరంగాల్లో మరింత పురోగతి సాధించే లక్ష్యంతో కార్యాచరణతో సాగుతున్నాం. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలతో పాటు రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గిరిజనులకు జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత తాగునీటిని అందుబాటులోకి తెచ్చాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

ఏడాది అంతా ప్రశాంతమే

జిల్లాలో ఈఏడాది పోలీసులు ప్రణాళికపరంగా చర్యలు చేపట్టి నేరాలను తగ్గించగలిగారు. మరోపక్క మారుమూల ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టి గిరిజనులకు మరింత చేరువయ్యారు. మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించి ప్రశాంత వాతావరణానికి బాటలు వేశారు.

- వ్యూహాత్మకంగా పోలీసుశాఖ చర్యలు
- జిల్లాలో నేరాలు తగ్గుముఖం
- సేవా కార్యక్రమాలతో గిరిజనులకు మరిత చేరువ
- మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం
- ఎస్పీ తుహిన్ సిన్హా



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు : జిల్లాలో క్రైం రేటు తగ్గిందని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో సీఐలు హిమగిరి, నారాయణలతో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గతేడాది కంటే 9శాతం క్రైం రేటు తగ్గిందని ఆయన పేర్కొన్నారు.

అదుపులో గంజాయి సాగు..

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పోలీసు శాఖ చేపట్టిన శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు కారణంగా జిల్లాలో గంజాయి సాగు, రవాణా గణనీయంగా తగ్గినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

- ఈ ఏడాది పోలీస్ శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సంయుక్తంగా నిర్వహించిన గంజాయి దాడుల్లో 266 కేసులు నమోదు చేశారు. 2,185.5కిలోల గంజాయితో పాటు మరో 16.775 కిలోల ద్రవరూప గంజాయిని సీజ్ చేశారు. ఈ సంఘటనల్లో మొత్తం 859 మంది ముద్దాయిలను అరెస్ట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 248.94 ఎకరాలలో 11,68,100 మొక్కలను పోలీసులు, సెబీ అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు. గిరిజనులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించారు. సుమారు 10290.5 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది 53 మంది గంజాయి ముద్దాయిలపై పీడీ యాక్ట్ విధించినట్టు ఎస్పీ తెలిపారు.

675 కేసులు.. 738 మంది అరెస్టు..

జిల్లాలో పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అక్రమ మద్యం, సారా తయారీ దారులపై దాడులు నిర్వహించి 675 కేసులు నమోదు చేసి 738 మంది అరెస్ట్ చేశారు. వారి నుంచి 11,422 లీటర్ల నాటు సారా సీజ్ చేశారు. 1,71,620 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు.

నిందితులకు కఠిన శిక్షలు..

జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది హత్యలు 3.3 శాతం రోడ్డు ప్రమాదాలు 17.9 శాతం తగ్గాయి. రెండు హత్య కేసుల్లో జీవిత ఖైదు, రెండు పోస్కో కేసులో నిందితులకు న్యాయస్థానం కఠిన శిక్షలు విధించాయి. 67 ప్రాపెర్టీ కేసుల్లో 35 కేసులకు సంబంధించి 33 మంది ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేశారు. చోరీ సొత్తు రికవరీశాతం 59.3 శాతానికి పెరిగింది. జలపాతాల వద్ద ముందు జాగ్రత్త చర్యలు కారణంగా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలిగామని ఎస్పీ పేర్కొన్నారు.

అక్కడక్కడ మావోయిస్టుల ఉనికి

జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం లేదని కేవలం ఏవోబీలో అక్కడక్కడ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలు మాత్రమే ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఏడాది ఐదుగురు మావోయిస్టు నేతలను, 21 మంది మిలీషియా సభ్యులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. మరో 18 మంది మావోయిస్టుల కొరియర్లపై బైండోవర్ చేశారు.ఏడుగురు మావోయిస్టులు, ముగ్గురు మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రెండు చోట్ల మావోయిస్టుల డంప్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వెల్లడించారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3050 మంది గిరిజన యువతకు పోలీసులు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన చింతపల్లి మండలం చింతపల్లి నుంచి కోరుకొండ వరకు తారురోడ్డు వేయించారు. 1,88,000 మందికి ఉచిత ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యం కల్పించారు.

- అమృత జలధార కార్యక్రమం ద్వారా మూడు గ్రామాల్లో ప్రత్యేక తాగునీటి పథకాలు నెలకొల్పారు. సుమారు 1500 మంది గిరిజనులకు తాగు నీరు అందిస్తున్నారు.
- పరివర్తన కార్యక్రమం ద్వారా 9620 మంది గిరిజనులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు.
- సుమారు 450 మంది గిరిజనులకు గిరి కర్షక మిత్ర కార్యక్రమం ద్వారా వ్యవసాయం చేసుకునేందుకు ఉచితంగా ట్రాక్టర్లను సరఫరా చేశారు.

న్యూస్‌రీల్

బొకేలు, గిఫ్టులు తేవద్దు

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

కొయ్యూరు: నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారంతా బొకేలు, శాలువాలు, గిఫ్టులకు బదులుగా నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని అరకు ఎంపీ మాధవి కోరారు. నూతన సంవత్సరం సోమవారం నాడు పాడేరు మండలం లోచలిపుట్టులోని తమ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.ఎవరు బొకేలు తేవద్దన్నారు.దానికి బదులుగా పెన్నులు,నోట్ పుస్తకాలు తీసుకువస్తే వాటిని విద్యార్థులకు ఇచ్చేందుకు వీలుగా ఉంటుందన్నారు.

పొగమంచుతో విహార యాత్రకు ఇబ్బందులు



కూనవరం మార్గంలో కురుస్తున్న పొగమంచు

ఎటపాక: పొగమంచు కారణంగా పాపికొండలు విహార యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. పాపికొండల విహారయాత్రకు నిత్యం వందలాది మంది వీఆర్ పురం మండలంలోని పోచవరం లాంచీల రేవుకు వస్తుంటారు. అక్కడ నుంచి గోదావరి నదిపై బోట్లలో విహారయాత్రకు వెళ్తుంటారు. ఈయాత్ర కోసం రాష్ట్రం నలు మూలల నుంచి మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా యాత్రికులు భద్రాచలం చేరుకుని అక్కడ నుంచి కార్లలో ఉదయం ఏడు గంటలకు బయలుదేరుతారు. అయితే కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలితీవ్రత పెరిగింది. పొగమంచు దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హెడ్‌లైట్లు వేసినప్పటికీ మంచు తీవ్రతకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఉదయం 10గంటల వరకు కూడా పొగమంచు కమ్మేయడంతో వారు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

సారా కేసులో నిందితుడికి రిమాండ్

వై.రామవరం: సారా కేసులో ఒక వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎం. సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని దేవరమడుగులు గ్రామానికి చెందిన గంత చంద్రరావు(34) శనివారం 10 లీటర్ల సారాతో పోలీసులకు పట్టుబడ్డాడు. అతనిని అరెస్టు చేసి, అడ్డతీగల కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి మూడు పశువుల మృతి

- అడివి పందుల కోసం ఏర్పాటుచేసిన తీగల వల్ల ప్రమాదం



విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఆవు

కొయ్యూరు: అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు మూడు పశువులను బలిగొన్నాయి. ఆడాకుల పంచాయతీ కిష్టారంలో బొడారపు చినబాబుకు చెందిన పశువులు శనివారం గ్రామ సమీపంలోని జీడితోటలోకి మేతకు వెళ్లాయి. అక్కడ అడవిపందుల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలను తాకడంతో మూడు పశువులు అక్కడే మృతి చెందాయి. సుమారు రూ.లక్షకు పైగా విలువైన పశువులు మృతి చెందడంతో యజమానికి చినబాబు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

పారిశుధ్య కార్యక్రమాలు మరింత విస్తృతం

- రూ.20 లక్షలతో సామగ్రి కొనుగోలు
- సర్పంచ్‌లకు పంపిణీ చేసిన అరకు ఎంపీ మాధవి



సర్పంచ్‌లకు పారిశుధ్య సామగ్రిని పంపిణీ చేస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

సాక్షి,పాడేరు: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు మరింత విస్తృతం చేసి స్వచ్ఛత లక్ష్యాలను సాధించాలని అరకు ఎంపీ మాధవి కోరారు. ఎంపీ నిధులు రూ.20,21,500తో కొనుగోలు చేసిన పారిశుధ్య సామగ్రి పరికరాలను శనివారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలకు పంపిణీ చేస్తున్న సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. గ్రామాల్లో చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్లలో వేసేలా ప్రజలను చైతన్యపరచాలని కోరారు. అనంతరం ఆమెను ఎంపీపీ సొనారి రత్నకుమారి,వైస్ ఎంపీపీ కనకరత్నం,సర్పంచ్‌లు శాలువా కప్పి సత్కరించారు. వారంతా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు బసవన్నదొర, సీదరి రాంబాబు, వంతాల రాంబాబు, మాదెలి రమణమ్మ, అప్పలకొండ, ఎంపీటీసీలు సల్లా చిట్టమ్మ, గిడ్డి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న తయారీ సామగ్రి

కొయ్యూరు: నాటుసారా బట్టీలపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. దీనిలోభాగంగా శనివారం మూలపేట పంచాయతీ మర్రిపాలెం, బొంకులపాలెంలో సారా బట్టీలపై సీఐ ఆర్‌ఎస్‌కే బాజీలాల్ ఆధ్వర్యంలో కొయ్యూరు, మంప ఎస్ఐలు రాజారావు, లోకేష్‌కుమార్ రెండు వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు, 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు.

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాముకు చెందిన దమ్ము దుర్గయ్య రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో సారా విక్రయిస్తుండగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు స్థానిక ఎస్ఐ వెంకయ్య తెలిపారు. వెలగలపాలెం గ్రామ శివారులో సారా బట్టీపై జరిపి దాడుల్లో 50 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్టు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. అదే ప్రాంతంలో 10 లీటర్ల సారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు.

320 కిలోల గంజాయి స్వాధీనం

- విలువ రూ.10 లక్షలు
- ఐదుగురి అరెస్టు
- బైక్, ట్రాక్టర్ సీజ్: అడ్డతీగల సీఐ రాంబాబు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాంబాబు

గంగవరం : ట్రాక్టర్‌లో తరలిస్తున్న రూ.10 లక్షల విలువైన 320 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు అడ్డతీగల సీఐ రాంబాబు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వివరాలను ఆయన వెల్లడించారు. ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి వాహన తనిఖీల్లో భాగంగా ట్రాక్టర్‌ను పరిశీలించారు. తొట్టెలో తొమ్మిది బస్తాల్లో ఉన్న 320 కిలోల గంజాయిని గుర్తించారు. ఒడిశా నుంచి తీసుకువచ్చిన గంజాయిని ఐదుగురు వ్యక్తులు పథకం ప్రకారం ట్రాక్టర్‌లో తరలిస్తున్నారని సీఐ తెలిపారు. ఒక వ్యక్తి బైక్‌పై పైలెట్‌గా రూట్ క్లియర్ చేసుకుంటూ ట్రాక్టర్‌లో ఉన్న వారికి సమాచారం అందిస్తూ అప్రమత్తం చేస్తున్నాడన్నారు. అనుమానంతో ట్రాక్టర్ తొట్టెను పరిశీలించగా గంజాయితో ఐదుగురు పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో పాత కేడీపేటకు చెందిన గొల్లవిల్ల జియ్యన్న , జి.మాడుగులకు చెందిన మండోదరి గణేష్, బుడుమెలకు చెందిన దల్లే రాజు, జికేవీధికి చెందిన ముర్ల బాలరాజు, జార్కండ్ జమ్‌షడ్‌పూరుకు చెందిన తిరుమలరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. గంజాయితోపాటు బైక్, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని చెప్పారు. ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని ఆయన అభినందించారు.

వంజంగి హిల్స్‌కు పర్యాటకులు రావద్దు

- వచ్చే నెల రెండు నుంచి వారం రోజులపాటు మూసివేత
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి హిల్స్‌ను వచ్చే నెల రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు వారం రోజుల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వంజంగి రోడ్డుతో పాటు హిల్స్ ప్రాంతమంతా కాలుష్యంతో నిండి ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపుతోపాటు రహదారికి మరమ్మతులు చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. పర్యాటకులు ఈ విషయాన్ని గుర్తించి వంజంగి హిల్స్ సందర్శనను వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు.

అరకులోయలో కలెక్టర్ పర్యటన



గిరిజన మ్యూజియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



కలెక్టర్ సుమిత్ కుమార్‌తో మాట్లాడుతున్న పెదలబుడు సర్పంచ్ దాసుబాబు

ప్రభుత్వ ఆస్పత్రి, గిరిజన మ్యూజియం సందర్శన

అరకులోయ టౌన్: మండల కేంద్రం అరకులోయలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యటించారు. దీనిలో భాగంగా ఆయన స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రి పరిశుభ్రంగా ఉండటంపై ఆయన సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సమేతంగా గిరిజన మ్యూజియంను కలెక్టర్ సందర్శించారు. గిరి గ్రామ దర్శిని అభివృద్ధికి రుణ రూపేణా నిధులు మంజూరు చేయాలని పెదలబుడు సర్పంచ్ పి. దాసుబాబు ఆయను కోరారు. దీనిపై సబంధింత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు డిగ్రీ విద్యార్థిని



విద్యార్థినితో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అరకులోయ టౌన్: స్థానిక మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కిల్లో ధనలక్ష్మి 58వ జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ రన్నింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు వచ్చే నెల 15న బిహార్ రాష్ట్రం గయాలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆమె ప్రయాణ ఖర్చుల నిమిత్తం అధ్యాపకురాలు స్వర్ణలత రూ.4 వేలు అందజేశారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ సీహెచ్ రామకృష్ణ, డాక్టర్ భరత్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నాగరాజు, పీడీ అప్పారావు శనివారం అభినందించారు.

పూరిల్లు దగ్ధం



బాధితురాలికి బియ్యం అందిస్తున్న వీఆర్వో

కూనవరం: అయ్యవారిగూడెంలో శనివారం పూరిల్లు దగ్ధమైంది. రూ. 90 వేల ఆస్తినష్టం వాటిల్లింది. రెవెన్యూ అధికారుల వివరాల ప్రకారం.. పైదా సీతమ్మ పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కట్టుబట్టలు మినహా సర్వం కాలి బూడిదయ్యాయి. వీఆర్వో జయంతి బాధితురాలి కుంటుంబానికి బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గూడెంకొత్తవీధి: రింతాడ వద్ద ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరిజన దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. జడుమూరుకు చెందిన సద్దా బాలరాజు, పార్వతి దంపతులు శనివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై చింతపల్లి బయలుదేరారు. వారిని రింతాడ సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108లో చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

గిరిజన మ్యూజియంలో సాంస్కృతిక వైభవం

- థింసా నృత్యాలతో పర్యాటకులకు జోష్
- అలరించిన వివిధ కళాకారుల ప్రదర్శనలు



బిందెలతో థింసా నృత్యం

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయ గిరిజన మ్యూజియం ప్రాంగణంలో మత్రి కామయ్య సాంస్కృతిక కళావేదికపై సాంస్కృతిక వైభవం నెలకొంది. కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ల ఆదేశాల మేరకు శనివారం పర్యాటకుల సౌకర్యార్థంగా పలు కళారూపాల ప్రదర్శనలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా అరకులోయ అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులను ఉత్సాహపరిచేందుకు ఈ నెల 30, 31 తేదీల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టూరిజం సెల్ మేనేజర్ మురళి, గిరిజన మ్యూజియం నిర్వాహకులు తెలిపారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యాలు, పలు కళా ప్రదర్శనలు తిలకించేందుకు పర్యాటకులు, స్థానికులు భారీగా తరలి వచ్చి సందడి చేశారు. ఇటువంటి ప్రదర్శనలు నిర్వహించడంతో మరింత జోష్ పెరిగిందని వారు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. థింసా నృత్య కళాకారులతో కలిసి పర్యాటకులు కుటుంబ సమేతంగా సందడి చేశారు.



తిలకిస్తున్న పర్యాటకులు



థింసా నృత్యం చేస్తున్న గిరిజన యువతులు



గిరిజనుల వైవిధ్య వాయిద్యం

న్యూఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి



రంపచోడవరం: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎటువంటి చర్యలనైనా సహించేది లేదని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 31 రాత్రి ప్రతి సెంటర్‌లో తనిఖీలు ముమ్మరంగా చేసేందుకు పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టంలు ఉపయోగించుట కోసం తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, జంక్షన్లలో కేకులు కట్ చేయడం నిషేధమన్నారు. అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించుట కానీ, తాగి వాహనం నడపడ, పేకాడుట నిషిద్ధమన్నారు. అతి వేగంగా నడపడ, సైలెన్సర్లు తీసి వాహనాన్ని నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రార్థనా మందిరాల వద్ద పోలీసు నిఘా, గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. నిర్ణీత సమయంలో ప్రార్థనలు ముగించుకుని వెళ్లాలని సూచించారు.

ప్రధానమంత్రి జన్‌మన్‌తో పీవీటీజీ గ్రామాల అభివృద్ధి

- ఐటీడీఏ పీవో అభిషేక్
- గుర్రగరువులో అవగాహన, నమోదు కార్యక్రమం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



ఆయుష్మాన్ భారత్ కార్డులు పొందిన ఆదివాసీలతో ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌తో పీవీటీజీ గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందుతాయని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండలంలోని మోదాపల్లి పంచాయతీ గుర్రగరువు గ్రామంలో పీఎం జన్‌మన్ పథకంపై అవగాహనతోపాటు నమోదు ప్రక్రియను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ జన్‌మన్ ద్వారా ప్రతి పీవీటీజీ కుటుంబానికి పక్కా గృహాలు, ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు, ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా, వారి జీవనోపాధులు పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు పాడేరు ఐటీడీఏ పరిధిలోని 1,597 గ్రామాల్లో సమగ్రమైన సర్వే చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీవీటీజీలకు నాణ్యమైన విద్యా, వైద్యం, పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. గ్యాస్ కనెక్షన్లు లేని పీవీటీజీలకు ఉజ్వల యోజన ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందిస్తామన్నారు. ఉచిత వైద్యం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్డుల ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్సలు పొందవచ్చన్నారు. వచ్చే నెల 15న జన్మన్ పథకాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తామన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు పథకాలు పొందటానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పక్కా గృహాల నిర్మాణం కోసం పీవీటీజీలకు రూ.2.39 లక్షలను అందిస్తున్నామన్నారు. ఇళ్లు లేని పీవీటీజీలు ఈ సొమ్ముతో తప్పనిసరిగా పక్కా ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. గుర్రగరువులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గృహ నిర్మాణాల కోసం 43 మంది, గ్యాస్ కలెక్షన్ల కోసం 14 మంది, బ్యాంకు ఖాతాల కోసం ఒకరు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అనంతరం ఆయన 188 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వి.ఎస్. ప్రభాకర్, ఎం. వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ బి.బాబు నాయక్, డీఆర్డీఏ పీడీ మురళి, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎంపీడీవో సాయినవీన్, ఎల్‌డీఎం రవితేజ, పీఎంయూ ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, సీడీపీవో ఝాన్సీ, ఏటీడబ్ల్యూవో రజనీ, తహసీల్దార్ వంజంగి త్రినాధనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- లబ్బూరు, జప్పారులో రూ.2.40 కోట్లతో బీటీరోడ్లకు శంకుస్థాపన



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర..

ముంచంగిపుట్టు: ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు,జప్పారు గ్రామాల్లో రూ.2.40 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్ల పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన్యంలో గిరిజన గ్రామాలకు మహర్దశ నెలకొందన్నారు. ప్రతి గ్రామానికి రహదారి,సీసీ రోడ్డు సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మారుమూల గిరిజనులు రవాణా కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి అవస్థలు లేకుండా చేయాలన్న సంకల్పంతో ప్రణాళికపరంగా చర్యలు చేపట్టిందన్నారు. ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్‌లు నీలకంఠం, గంగాధర్, ఎంపీటీసీ కమల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల వైఎస్సార్‌సీపీ నేతలు జయదేవ్, సోలెమాన్, తిరుపతిరావు, భగత్‌రామ్, మూర్తి, బుద్దు, రాంప్రసాద్, సన్యాసిరావు, రాజారావు, దాసు, పులిరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో ప్రతిభ

- జాతీయస్థాయిలో అవార్డు పొందిన కానిస్టేబుల్ ప్రసాద్
- సత్కరించిన ఎస్పీ తుహిన్ సిన్హా



కానిస్టేబుల్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు : పోలీసుశాఖలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఎ. ప్రసాద్ జాతీయస్థాయిలో అవార్డు సొంతం చేసుకున్నారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఏటా జాతీయ స్థాయిలో నామినేషన్లు స్వీకరించి ఎంపవరింగ్ పోలీస్ విత్ ఐటీ పేరిట అవార్డులు అందజేస్తోంది. ఇలా దేశంలో వివిధ పోలీసుస్టేషన్ల నుంచి అందిన నామినేషన్లను పరిశీలించిన ఎన్‌సీఆర్‌బీ 45 మందిని అవార్డులకు ఎంపిక చేసింది. వీరిలో రాష్ట్రం నుంచి ముగ్గురికి అవార్డులు దక్కాయి. వీరిలో జిల్లా పోలీసు కార్యాలయంలోని ఐటీ కోర్ టీంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఎ. ప్రసాద్ ఒకరు. ఈ మేరకు న్యూఢిల్లీలో అవార్డు అందుకున్న ఆయన శనివారం పాడేరు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్పీ తుహిన్ సిన్హా సత్కరించి జ్ఞాపిక, ప్రత్యేక రివార్డును అందజేశారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ హిమగిరి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఐటీ కోర్ టీం సిబ్బంది కూడా అభినందించారు.

ప్రతి రేషన్ కార్డుదారుడికి సకాలంలో బియ్యం

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



రాజుపేటలో పరిశీలిస్తున్న పీవో కావూరి చైతన్య

వీఆర్‌పురం: ప్రతీ రేషన్ కార్డుదారుడికి సకాలంలో బియ్యం అందించేలా ఎండీఎం ఆపరేటర్లు, వలంటీర్లు కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. పీడీఎస్ బియ్యం పంపిణీపై మండలంలోని వడ్డిగూడెం, రాజుపేట, చింతరేగుబల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు, ఎండీఎం ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పీడీఎస్ బియ్యం పంపిణీ కార్యక్రమం సంబంధిత సచివాలయ వలంటీర్ల ద్వారా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీధర్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్



చింతపల్లి రూరల్: ఆన్‌లైన్ మోసాలపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ హెచ్చరించారు. గిరిజనుల అవగాహన లోపం వల్ల ఆన్‌లైన్, చైన్‌లింక్ మోసాలకు గురవుతున్నారన్నారు. ఒకరి కింద మరో ఇద్దరు, వారి కింద ఇంకో ఇద్దరిని చేర్పిస్తే బోనస్‌లు, కమీషన్లు వస్తాయని నమ్మిస్తున్నారన్నారు. మోసగాళ్లు అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మించి చివరకు చేతులెత్తేస్తారని హెచ్చరించారు. యువత ముందుగా అలాంటి వాటికి లోనవుతున్నారని వాపోయారు. ఎవరైనా సరే ఇలాంటి చైన్‌లింక్, ఆన్‌లైన్లో డబ్బులు పెట్టదలుచుకుంటే ముందుగా పోలీసులను సంప్రదిస్తే, దానిపై వారికి అవగాహన కల్పిస్తామన్నారు. ఇటువంటి సందర్భంలో డబ్బులు పోయినట్లయితే తమను సంప్రదిస్తే, రికవరీకి చర్యలు తీసుకుంటామన్నారు.